ప్రజాశక్తి

బుధవారం 7 జూన్ 2023 5

శ్రీ సత్యసాయి



కొండెక్కిన కోడిగుడ్డు ధర

ఆకాశాన్నంటుతున్న నిత్యావసరాల ధరలు

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్



కోడిగుడ్డు ధర కొండెక్కింది. ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏ వస్తువు కొనలేని పరిస్థితి నెలకొందని సామాన్యులు వాపోతున్నారు. సామాన్యులకు అందుబాటులో ఉంటున్న కోడిగుడ్డు ధర అమాంతంగా 7 రూపాయలకు పెరిగింది. గతంలో రూ.5 నుంచి 6 రూపాయలు పలుకుతున్న గుడ్డు ధర వారం నుంచి 7 రూపాయలకు పెరిగింది. ఒకవైపు కాయగూరల ధరలు, నిత్యావసర వస్తువులు ధరలు పెరగడంతో ఏమి కొనలేక, ఏమి తినలేక పోతున్నామని సామాన్యులు వాపోతున్నారు. సన్న బియ్యం రూ.40 నుంచి 50 రూపాయలు ఉండగా, కందిబేడలు గతంలో కేజీ రూ. 120 ఉండగా వారం నుంచి 140 రూపాయలకు పెరిగింది. వట్టి మిరపకాయలు కేజీ రూ.270లకు చేరింది. బెల్లం మంచి క్వాలిటీ అయితే కేజీ 52 రూపాయలు, తెల్ల గడ్డలు కేజీ వంద రూపాయలు పలుకుతుండగా వంటనూనె ధరలు కాస్త ఊరటనిస్తున్నాయి. కూరగాయలు ప్రతిదీ కేజీ రూ.30 నుంచి 40 రూపాయల వరకు ధర పలుకుతోంది. గ్యాస్ సిలిండర్ ధర ఏకంగా రూ.1200 వరకు చేరింది. వెయ్యి రూపాయలు తీసుకెళ్లితే చేతిసంచిలోకి కూడా సరుకులు రావడం లేదని సామాన్యులు వాపోతున్నారు. పెట్రోలు, డీజల్ విపరీతంగా ధరలు పెరిగాయి. నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ప్రజలు విమర్శిస్తున్నారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం



ఆహారపదార్థాల తయారీలో రసాయనాల వాడకం

చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలం



పైన పటారం...లోన లోటారం...అన్నచందంగా హిందూపురం పట్టణంలో కొన్ని హోటళ్లు,రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లు ఉన్నాయి. ఇవి బయట నుంచి చూస్తే బహు ముచ్చటగా కనిపిస్తాయి. అయితే లోపలకి వెళ్లి చూస్తే అసలు విషయం తెలుస్తోంది. నోరూరించే ఆహార పదార్థాల పేరుతో రంగు రంగుల విషం వడ్డిస్తున్నారు. వాటిని తింటే జబ్బులను కొని తెచ్చుకున్నట్లే. విపరీతంగా కల్తీ చేస్తున్నారు. రోజుల తరబడి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన, కుళ్లిన పదార్థాలకు రసాయనాలు, మసాలాలు దట్టించి వడ్డిస్తున్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. కల్తీని అరికట్టాల్సిన అధికారులు అటువైపు చూడటం లేదన్న విమర్శలు వినపడుతున్నాయి. ఎప్పుడైన ఎవరైన ఒత్తిడి చేస్తే తూతూ మంత్రంగా తనఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న ఆరోపణలు వినపడుతున్నాయి.



హోటల్‌లోని ఆహారపదార్థాల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్‌ఫొటో)

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీసత్య సాయి జిల్లాలోనే అతి పెద్ద పట్టణం హిందూపురం.వివిధ ప్రాంతాలతో పాటు కర్నాటక నుంచి నుంచి సైతం నిత్యం వేలాది మంది వివిధ పనుల నిమిత్తం హిందూపురం పట్టణానికి వచ్చి వెళుతుంటారు. వీరందరు ఆకలి తీర్చుకోవడానికి హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లకు వెళుతుంటారు. వారు అక్కడ విషపూరితమైన ఆహారం తిని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు తినే ఆహారం కడుపులో రోగాలపుట్టగా మారుతోంది. హోటల్ నిర్వహణకు నాణ్యతా ప్రమాణాలకు సంబంధించిన అనుమతులు తప్పనిసరి తీసుకోవాల్సి ఉంది. అయితే పట్టణంలో కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్‌లకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు తెలుస్తోంది. మిగిలిన వారు నాణ్యతకు తిలోదకాలిస్తూ కల్తీ పదార్థాలతో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. గత సంవత్సరం మున్సిపల్ కమిషనర్ ఒత్తిడి మేరకు ఆహార భద్రత అధికారులు మెరుపుదాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భారీస్థాయిలో కల్తీ పదార్థాలు బయటపడ్డాయి. రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు ఏర్పాటు చేయాలంటే ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) లైసెన్స్ తప్పనిసరి. లైసెన్స్ లేకుండా తనిఖీల్లో దొరికితే సెక్షన్ 63 ప్రకారం ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే ఆరు నెలల జైలుశిక్షతో పాటు రూ.5లక్షలు జరిమానా విధిస్తారు. బిర్యానీ సెంటర్‌లో వంటకాల తయారీలో పకృతి సిద్ధమైన రంగులే వాడాలి. వాస్తవానికి అవి ఎక్కడా కనిపించవు. పట్టణంలోని దాదాపు 200 వరకు బిర్యానీ సెంటర్లున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఐదు శాతం సెంటరుల కూడా నిబంధనలు పాటించడం లేదన్నది నగ్నసత్యం.

తూతూ మంత్రంగా తనిఖీలు

హిందూపురం పట్టణంలో రెస్టారెంట్లు, హోటళ్లు, బిర్యానీ సెంటర్లు, బేకరీలు, చాట్ సెంటర్లు, టీ స్టాళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఇలా దాదాపు 500కిపైగా ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అనుమతులు ఉన్నాయి. కేవలం మున్సిపల్ శాఖ తరపున ట్రేడ్ లైసెన్స్ పొంది వ్యాపారాలు చేస్తున్నారు. ఇందులో కొన్ని మాత్రమే అన్ని నిబంధనలు పాటిస్తున్నాయి. మిగిలిన వారు నిబంధనలు ఉల్లంఘించి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత వరకు ఆహార భద్రత అధికారులు పూర్తి స్థాయిలో తనఖీలు నిర్వహించలేదు. చర్యలు చేపట్టలేదు. సంవత్సరంలో ఒకటి...రెండు సార్లు తూతూ మంత్రంగా తనిఖీలు నిర్వహించి మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయంలో అధికారుల చిత్తశుద్ధిపై పలు అరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో తాము ఏమి చేసినా ఏలాంటి ఆహార పదార్థాలు వండి వడ్డించిన ఎవరూ తమపై చర్యలు తీసుకోరన్న ధీమాతో వ్యాపారులు రెచ్చిపోతున్నారన్న వాదనలు వినిపిస్తున్నాయి. అధికారులు తరచూ దాడులు చేస్తే నాణ్యమైన ఆహారం అందుతుందని ప్రజలు అంటున్నారు.

ప్రమాదంలో ప్రజారోగ్యం

హోటళ్ల లోపల పరిశుభ్రంగా ఉంచాలి. డ్రైనేజీ వసతి బాగుండాలి. వంట వండే వ్యక్తి, వడ్డించే వారు, హోటల్ యజమానికి డాక్టర్ సర్టిఫికెట్ తప్పనిసరి. అయితే ఈ నిబంధనలు ఎక్కాడా అమలు కావడం లేదు. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు మినహాయిస్తే మిగిలిన వాటిలో పరిశుభ్రత పాటించడం లేదు. నాసిరకం కూరగాయలు వాడుతున్నారు. కొన్ని పదార్థాలను ఫ్రిజ్‌లో ఉంచి, రెండు మూడు రోజుల తరువాత వండుతున్నట్లు అధికారులు గుర్తించారు. హోటళ్లకు వెళ్లే వారికి టేస్టింగ్ ఫుడ్ పేరుతో టేస్టింగ్ సాల్ట్ (చైనాసాల్ట్) వాడుతున్నారని తెలుస్తోంది. ఇది నిబంధనలకు విరుద్ధం. బిర్యాని సెంటర్లలో బిర్యానీ, చికెన్‌కు రంగులు వేస్తున్నట్లు సమాచారం. హిందూపురం పట్టణంలో చాలా హోటళ్లలో ఇలాంటి పరిస్థితి ఉన్నట్లు అధికారులు చెప్పడం గమనార్హం.

నాణ్యత పాటించకపోతే కేసుల నమోదు



హోటళ్లు, రెస్టారెంట్లు, బిర్యానీ సెంటర్లలో నాణ్యమైన ఆహారం అందించకపోతే కేసులు నమోదుచేస్తాం. హిందూపురంలోని కొన్ని బిర్యానీ సెంటర్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో వాడిన నూనెతోనే మళ్లీ, మళ్లీ వంటలు వండుతున్నారు. మరికొన్ని చోట్ల రెండు మూడు రోజులు పదార్థాలను ఫ్రిజ్‌లో పెట్టి, అందజేస్తున్నారు. దీనివల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉంది. నిర్వాహకులు తప్పని సరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలి. లేని పక్షంలో వారిపై కేసులు నమోదు చేస్తాం. వ్యాపారులకు ఆన్‌లైన్ విధానంలో ఆహార భద్రతపై శిక్షణ ఇస్తున్నాం. ఆసక్తి గల వారు శిక్షణ పొందవచ్చు.

తస్లీం,
ఫుడ్‌సేఫ్టీ అధికారిణి

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అసంబద్ధాలను తొలగించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీల్లో చోటు చేసుకున్న అసంబద్ధాలను తొలగించాలని యుటిఎఫ్ జిల్లా నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జెఎన్‌టియు సమీపంలోని సైన్స్ సెంటర్‌లో జిల్లా విద్యా శాఖ అధికారి సాయిరాంను యుటిఎఫ్ నాయకులు కలిసి ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ అనంతపురం జిల్లా గౌరవాధ్యక్షులు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరాజులు, శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో అనేక తప్పులు చోటు చేసుకున్నాయన్నారు. సోషియల్ స్టడీస్ (కన్నడ మీడియం) సీనియారిటి లిస్ట్‌లో అవకతవకలు జరిగాయని తెలిపారు. డీఎస్సీ 2000కు సంబంధించిన ఎవి.రాధారిణి, ఎస్‌జిటి(కన్నడ), ఎంపియుపిఎస్, ఓబుళాపురం గ్రామం, డీ హీరేహాల్‌ను పొజిషనల్ సీనియారిటీ లిస్ట్‌లో చూపించారన్నారు. అయితే ఫైనల్ సీనియారిటీ లిస్ట్‌లో తనకన్నా జూనియర్ అయిన డీఎస్సీ-2002కు చెందిన గంజి తిప్పేస్వామిని (ఎస్‌జిటి కన్నడ) చూపించారని చెప్పారు. సీనియర్ ఎవి.రాధారాణి అభిప్రాయం తీసుకోకుండా లిస్ట్ నుంచి తొలగించారని అన్నారు. అలాగే బదిలీ ప్రక్రియలో తప్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. బదిలీల సాఫ్ట్‌వేర్‌లో 16-5-2013న ఆ పాఠశాలకు సంబంధించిన స్టేషన్ పాయింట్స్ 30.1230గా చూపిస్తోందన్నారు. 15-5-2013న చేరిన వారికి స్టేషన్ పాయింట్స్ 30.18780గా చూపిస్తోందన్నారు. ఈ సమస్య ఎస్‌జిటి, ఎస్ఎ(టి) ఇతర క్యాడర్‌ల వారికి ఉందని సాఫ్ట్‌వేర్ సమస్యను సరి చేయాలని కోరారు. బదిలీల్లో కొన్ని పోస్టులను బ్లాక్ చేయడం జరిగిందన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మంది పిల్లలు ఉన్న చోట బ్లాక్ చేసి, తక్కువ మంది పిల్లలు ఉన్న చూపించడం జరిగిందన్నారు. దీని వల్ల చాలా మంది విద్యార్థులు సబ్జెక్ట్ టీచర్ లేకపోవడం వల్ల డ్రాపౌట్స్‌గా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కావున ఎక్కువ మంది పిల్లలు ఉన్న చోట చూపించి, తక్కువ మంది పిల్లలు ఉన్న చోట బ్లాక్ చేయాలని కోరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా సరి చేయాలని వారు డిమాండ్ చేశారు.



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు



లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్

గృహ నిర్మాణాల జాప్యంపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజాశక్తి బుక్కపట్నం

జగనన్న కాలనీల్లో గృహనిర్మాణాల్లో జరుగుతున్న జాప్యంపై కలెక్టర్ అరుణ్‌బాబు అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని బుచ్చయ్య గారి పల్లి వద్ద ఉన్న జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో జరుగుతున్న ఇంటి నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలు చేపట్టకపోతే ఎలా అని అధికారులను ప్రశ్నించారు. గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు అధికారులు అవగాహన కల్పించి వెంటనే నిర్మాణాలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక కేజీబీవీ వద్ద 72 మందికి గృహాలు మంజూరు కాగా, 16 మంది మాత్రమే ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని గుర్తించారు. బేస్ మెట్టు, బిలో బేస్ మెంట్ స్థాయిలో ఉన్న వాటిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. వారం లోపు పనులు ప్రారంభించాలని లేనిపక్షంలో వాటిని రద్దుచేసి అర్హులైన మరొకరికి గృహాల కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. లబ్ధిదారులు ఇంటి నిర్మాణానికి ఎందుకు ముందుకు రావడం లేదో తెలుసుకోవాలని చెప్పారు. ఇల్లు నిర్మించుకునే వారికి స్థలాన్ని కేటాయించాలని తెలిపారు. జగనన్న కాలనీలో అన్ని మౌలిక సదుపాయాలను సత్వరమే పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో భాగ్యరేఖ, హౌసింగ్ పీడీ చంద్రమౌళి, హౌసింగ్ ఇన్‌ఛార్జి డిఇ షామీర్‌బాషా, తహశీల్దార్ నటరాజ్, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎస్ఐ నరసింహుడు, సర్పంచి రూప, ఎఇ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

టైం పాస్ చేస్తున్నారా..?

సచివాలయ సిబ్బందిపై కమిషనర్ ఆగ్రహం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులు ఉద్యోగం చేస్తున్నారా....? లేకా టైం పాస్ చేస్తున్నారా..అని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ అమ్యూనిటీ సెక్రటరీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం తన చాంబర్‌లో అమ్యూనిటి సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారి పనితీరుపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘంలో నిర్వహించిన వార్డుల్లో 101 ఫిర్యాదులు అందాయనివాటిని ఇప్పటి వరకు ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. వీటిని బుధవారం లోగా పరిష్కరించాలని, లేని పక్షంలో క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డిఇఇ నీరజ, ఎఇ నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ఇక్బాల్‌కు లైన్‌క్లియర్..?



ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ, వైసిపి నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు లైన్‌క్లియర్ అయినట్లు ఆయన వర్గీయులు చెబుతున్నారు. హిందూపురం వైసిపి ఇన్‌ఛార్జిగా ఉన్న ఎమ్మెల్సీ షేక్ మమహ్మద్ ఇక్బాల్‌ను తప్పిస్తారని ఆయన స్థానంలో మంత్రి పెదిరెడ్డి కొత్త వ్యక్తిని తీసుకోస్తున్నారని గత కొంత కాలంగా ఊహగానాలు చెలరేగాయి. వీటిని బలపరిచేలా మంత్రి పెద్దిరెడ్డి చర్చలు కొనసాగాయి. ఆయన హిందూపురం నియోజక వర్గంలోని వైసిపి ముఖ్య నేతలను పిలిపించి పార్టీ కోసం పని చేసేలా ఒప్పించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌తో సైతం చర్చలు జరిపి, కొత్త వ్యక్తిని రంగంలోకి తీసుకోస్తున్నట్లు సూచనప్రాయంగా వెల్లడించారు. దీంతో ఎమ్మెల్సీ ఇక్బాల్ వర్గం డీలా పడింది. అయినా పట్టుదలతో కొంత మంది నాయకులు ఎమ్మెల్సీ ఇక్బాల్‌కు ఇక్కడి టికెట్ ఇవ్వాలని పట్టుబట్టారు. ముఖ్యమంత్రి వద్దే ఏదో ఒకటి తేల్చుకోవాలని ఇక్బాల్‌కు సూచించారు. ముఖ్యమంత్రికి తెలియకుండా మంత్రి పెదిరెడ్డి మంత్రాగాన్ని నడుపుతున్నారని వారు ఆరోపించారు. ఆయన రంగంలోకి తీసుకోస్తున్న వ్యక్తికి నియోజకవర్గంలో కనీస స్థాయిలో పట్టులేదని, బెంగళూరులో వ్యాపారం చేస్తున్నారని వివరించారు. కోట్లాది రూపాయాలు ఖర్చు పెడతారని చెబుతున్నా వారి ఆర్థిక పరిస్థితి అంత బలంగా లేదని వివరించారు. ఎమ్మెల్సీ ఇక్బాల్‌ను ఇక్కడి నుంచి తప్పిస్తే నియోజక వర్గంలో కీలక ఓటు బ్యాంకు అయిన మైనార్టీలు పార్టీకి దూరం అవుతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇదే విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని వారు నిర్ణయించారు. ఇందులో భాగంగా ముఖ్యమంత్రిని ఎమ్మెల్సీ ఇక్బాల్ మంగళవారం కలిశారు. ఈసందర్భంగా ఆయన పెద్దిరెడ్డి సమక్షంలోనే చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. 'మీరు చెబితే తాను వెళ్లి పోవడానికి సిద్ధమని, కాని మంత్రి రంగంలో దించుతున్న అభ్యర్థి వల్ల ఎలాంటి ప్రయోజనం లేద'ని ఎమ్మెల్సీ నేరుగా ముఖ్యమంత్రికే వివరించినట్లు సమాచారం. 2024 ఎన్నికల్లో కదిరి నుంచి పోటీ చేస్తారా అని సిఎం ఎమ్మెల్సీని ఈసందర్భంగా అడిగినట్లు తెలిసింది. అయితే నాలుగు

ముఖ్యమంత్రి ఎదుట తేలిన 'పురం' పంచాయితీ

సంవత్సరాలుగా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయడంతో పాటు గతంలో ఎప్పుడు లేని విధంగా రికార్డు స్థాయిలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులతో పాటు కౌన్సిలర్లను గెలిపించామని, ఇక్కడి నుంచే పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని ఈసందర్భంగా ఎమ్మెల్సీ ముఖ్యమంత్రిని కోరినట్లు సమాచారం. దీంతో ముఖ్యమంత్రి దీనిపై సుముఖత వ్యకం చేసినట్లు తెలిసింది. తమకు హిందూపురంలో అభ్యర్థిని మార్చాలని ఆలోచన లేదని ముఖ్యమంత్రి చెప్పినట్లు తెలుస్తోంది. 2024 ఎన్నికల్లోను అవకాశం ఇస్తామని ఇక్బాల్‌కు చెప్పినట్లు సమాచారం. సమావేశం అనంతరం హిందూపురం మాజీ సమన్వయకర్త వేణుగోపాల్ రెడ్డి, చిలమత్తూరు మండల సీనియర్ నాయకులు జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిని కలిసి ఇక్బాల్‌కు టికెట్ ఇవ్వాలని లేక పోతే పార్టీ దెబ్బతింటుందని వివరించినట్లు నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి చెప్పిన మాటలతో ఇక్బాల్ వర్గంలో ఆనందోత్సవాలు నెలకొన్నాయి. అదే విధంగా హిందూపురం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల విడుదల గురించి చర్చించినట్లు సమాచారం.

కనీస వేతనాలు అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-రొళ్ల



వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీ గార్డులకు కనీస వేతనాలు అమలు చేయాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత ఆసుపత్రిలో పని చేస్తున్న స్వీపర్లు, సెక్యూరిటీగార్డులు మంగళవారం సిఐటియులో చేరారు. ఈ సందర్భంగా శివప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ హాజరై మాట్లాడారు. వారికి ఈఎస్ఐ అమలు చేయడంలో, పిఎఫ్ స్లిప్పులు, కనీస వేతనాలు ఇవ్వడంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని, వెంటనే ఆయా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, అయితే ఒక్కో ప్రాంతంలో ఒక్కో రకంగా వేతనం చెల్లిస్తూ కార్మికులను దోపిడీకి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని రకాల కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, లేనిచో కార్మికులందరినీ ఏక తాటిపకి తీసుకొచ్చి వారి హక్కులు, సమస్యల పరిష్కారం కోసం సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం వైద్యాధికారి సుజనాకి సమస్యలతో కూడిన వినతిపత్రం సమర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నికున్నారు. అధ్యక్షురాలిగా వరలక్ష్మి, ఉపాధ్యక్షులుగా బాలరాజ్, కార్యదర్శిగా శివప్ప, సహాయ కార్యదర్శిగా రామలక్ష్మి, కోశాధికారిగా తిప్పేస్వామి, సభ్యులుగా మంజమ్మ, హనుమక్క, త్రివేణి, ఉమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికున్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి రూరల్: ప్రాణవాయువుని ఇచ్చే మొక్కలను కాపాడడం అందరి బాధ్యత అని జిల్లా వైద్యాధికారి ఎస్‌వి కష్ణారెడ్డి సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో మొక్కలు నాటి, వాటి ఉపయోగం గురించి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పౌరుడు తన పుట్టినరోజు సందర్భంగా ఒక మొక్కను నాటితే ఎంతో ఉపయోగమన్నారు. ఎన్సిడి అండ్ ఆర్‌బిఎస్‌కే పిఓ డాక్టర్ నివేదిత మాట్లాడుతూ ప్రాణవాయువు ఇచ్చే మొక్కలను కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అనంతరం ఏపీ డమాలజిస్ట్ బాలాజీ నాయక్ పర్యావరణాన్ని పరిరక్షిస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ నాగేష్, లలితకుమారి, డీసీఎం త్రిలోకనాథ్, సూపర్‌వైజర్ రమణ, ఎంపిహెచ్‌ఎ శివయ్య, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఎకరాకు రూ. కోటి ఇవ్వాలి

ప్రజాశక్తి-చిలమత్తూరు



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారికి భూములు కోల్పోతున్న తమకు నష్టపరిహారంగా రూ. కోటి చెల్లించాలని రైతులు డిమాండ్ చేశారు. కోడూరు తోపు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూమిని కోల్పోతున్న రైతులతో పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ గ్రామ సభను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం వైపు నుంచి భూమి ప్రస్తుత రిజిస్ట్రేషన్ ధర మేరకు ప్రభుత్వ నిబంధనల మేరకు ఎకరానికి అత్యధికంగా రూ. 34 లక్షలు వరకు చెల్లించేందుకు అవకాశం ఉంటుందని చెప్పగా రైతులు సుముఖత చూపలేదు. రూ. కోటి రూపాయాలకు పైన ఇవ్వాలని కోరారు. గతంలో సెజ్‌ల పేరుతో రైతులు భూములు కోల్పోయారు. ఈ తరుణంలో ఉన్న అర కొరా భూమి చేజారితే తాము ఎలా బతకాలని ప్రశ్నించారు. తమ బతుకుకు భరోసా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తే ఎకరానికి రూ. కోటి అయితేనే న్యాయం అవుతుందన్నారు. రైతుల అభిప్రాయాన్ని ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, సర్పంచి మురళీ, వీఆర్వో రాజేష్, సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

హిందూపురం : చిన్నారులకు తల్లి పాలతో పాటు పౌష్టిక ఆహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ చిన్న పిల్లల వైద్యులు కేశవులు, వెంకటరమణలు పేర్కొన్నారు. చిన్నపిల్లల అనుబంధ ఆహార దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా చిన్నపిల్లల వైద్యుల ఆధ్వర్యంలో అనుబంధ ఆహారంపై ర్యాలీ, ఐకె హాల్లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత సూపరింటెండెంట్, చిన్నపిల్లల వైద్యులు వెంకటరమణ, సీడీపీవో రెడ్డిరమణమ్మ, జిల్లా వైద్యఆరోగ్యశాఖ కృష్ణ, ఐఎపి జిల్లా కార్యదర్శి రామచంద్రరావు మాట్లాడుతూ చిన్న పిల్లల సంపూర్ణ ఆరోగ్యం గురించి అవగాహన కల్పించారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే 2019-21 ప్రకారం 32శాతం ఐదు సంవత్సరాల లోపు పిల్లలు పోషణకు లోనవుతున్నారన్నారు. బిడ్డకు ఆరుమాసాలు గడచిన తర్వాత తల్లిపాలతో పాటు అనుబంధ ఆహారం అందిస్తే ఆ బిడ్డ పౌష్టికంగా ఎదిగే అవకాశం ఉందన్నారు. ఈ విషయాన్ని ప్రతి బిడ్డ తల్లి గమనించాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, ఆశా. వైద్యసిబ్బందికి లఘుచిత్రం ప్రదర్శించి అవగాహన కల్పించారు.

చిరుధాన్యాల సాగుపై అవగాహన సదస్సు

అమరాపురం : చిరుధాన్యాల పంట సాగు విస్తీర్ణం పెంపుపై మంగళవారం స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో ఎంపిపి లలితమ్మ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా అధికారి లక్ష్మీకాంతం హాజరై పలు విషయాలు వివరించారు. సమావేశంలో యాప్ పిఒ సీసీ లక్ష్మీనరసింహ, సీసీ సన్నప్ప, నాగరాజు, అకౌంటెంట్ వరలక్ష్మి, యానిమేటర్లు, తదితరులు పాల్గొన్నారు

నేడు వాహనాల వేలం

పెనుకొండ : పెనుకొండ సెబ్ స్టేషన్ పరిధిలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వివిధ వాహనాలకు పుట్టపర్తి సెబ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో బుధవారం(నేడు) ఉదయం 10 గంటలకు పెనుకొండ సెబ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహించనున్న ట్లు సెబ్ సీఐ సుబ్బారెడ్డి తెలిపారు. ఆసక్తి కలిగినవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు నిర్ణయించిన రుసుము ను చెల్లించి పాల్గొనవచ్చు అన్నారు. ఇతర వివరాలకు పెనుకొండ సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

రాళ్లపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ : మండల పరిధిలోని రాళ్లపల్లి గ్రామంలో 4 నెలలుగా నెలకొన్న తాగునీటి ఎద్దడికి అధికారులు పరిష్కారం చూపారు. పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప మంగళవారం రాళ్లపల్లి గ్రామం వెళ్లి అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న తాగునీటి కొళాయిలను తొలగించడంతో పాటు పాడైన పైపులైన్లకు మరమ్మతులు చేయించారు. అలాగే బోరు ద్వారా నీటిని సరఫరా చేసి తాగునీటి సమస్యను పరిష్కరించారు. పైపులైన్ ద్వారా తాగునీరందని ఇళ్లకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని తెలిపారు. త్వరలోనే ఆ ఇళ్లకూ పైపులైన్ ద్వారా తాగునీరు అందిం చడానికి చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సజావుగా 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కొత్తచెరువు : జిల్లా వ్యాప్తంగా పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సజావుగా జరుగుతున్నాయని ఏడి నాగరాజు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 58 సెంటర్లలో మంగళవారం గణిత పరీక్షకు 8,849 మందికి గానూ 7,748మంది హాజరు కాగా 1101 మంది గైర్హాజరు అయ్యారన్నారు.

నేడు చేపల చెరువు వేలం

లేపాక్షి : మండల పరిధిలోని సిరివరం, మానేంపల్లి గ్రామాల ఉమ్మడిచెరువు, అలాగే గోపిందేవరపల్లి చెరువులకు సిరివరం పంచాయతీ కార్యాలయంలో బుధవారం(నేడు) ఉదయం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు తెలిపారు. పాల్గొనదలచిన వారు ధరావత్తు రూ. 5వేలు చెల్లించి పాల్గొనవచ్చు అని తెలిపారు.

ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలి

ధర్మవరం : రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని ఒప్పంద అధ్యాపకుల జేసీ నాయకులు పెద్దన్న, గురుప్రసాద్‌రెడ్డి, ఇస్మాయిల్, మధు, శ్రీను, నాయక్, కుమార్ చౌదరి, ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న మేరకు సీఎం జగన్ ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరారు. తెలంగాణలో 2014 జూన్ 2వ తేదీ ముందు విధులు నిర్వర్తిస్తున్న అధ్యాపకులందరినీ అక్కడి ప్రభుత్వం క్రమబద్ధీకరించిందని, కావున ఏపీలో కూడా క్రమబద్ధీకరించాలని కోరారు.

పదవీ విరమణ ఉద్యోగుల వివరాలివ్వండి

కదిరి టౌన్: ఆర్టీసీ లో 1998 నుంచి ఇప్పటివరకు వయో/వలంటీర్/మెడికల్ కారణాల ద్వారా పదవీ విరమణ పొందిన ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానం చేసిన ఫోన్ వివరాలను కదిరి డిపోలో అందజేయాలని మేనేజర్ బి.మైనుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం డిపోకు అందుబాటులో లేని ఉద్యోగులు ఆధార్ కార్డులో ఫోన్ నంబరు, స్టాఫ్ నంబరు రాసి అసిస్టెంట్ మేనేజర్ హరిమోహన్ వాట్సాప్ ఫోన్ 73828 61895కి ఈ నెల 9లోగా పంపాలన్నారు.

శ్రీవారి కల్యాణోత్సవ టికెట్లు బుకింగ్

కదిరి టౌన్ : పట్టణంలో వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీవారి ఆర్జిత కల్యాణోత్సవం సేవ జూన్-2023 టికెట్లను ఈ నెల 11 నుంచి 30వ తేదీ లోపు బుకింగ్ చేసుకోవచ్చని ఆలయ అధికారులు తెలిపారు. ఒక రోజుకు 5 టికెట్లు మాత్రమే జారీ చేస్తారన్నారు. టికెట్ ధర రూ. 4000లు, ఒక టికెట్‌పై ఐదుగురికి ప్రవేశం ఉంటుందని తెలిపారు.

ఆశావర్కర్లపై వేధింపులను ఆపాలి

రొళ్ల : ఆశా వర్కర్లపై వేధింపులు ఆపాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆశా డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత ఆశా వర్కర్లు వేధింపులకు గురవుతున్నారని, సంబంధించిన అధికారులు జోక్యం చేసుకోవాలని కోరారు. రొళ్ల ఆసుపత్రిలో సిబ్బందికి కనీసం బాత్‌రూంలు లేవని, రోగులు రాత్రికి ఉండాల్సి వస్తే విద్యుత్ బల్బులు వారే తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు. 1000 మంది జనాభాకు ఒక ఆశా వర్కర్‌ని నియమించాల్సి ఉండగా రాష్ట్ర ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ వచ్చిన తర్వాత 2000, 3000 మంది జనాభాకు ఒకే ఆశా వర్కర్‌తో పనిచేయించడం బాధాకరమన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ ఆశా వర్కర్లతో పని చేయించడం, వేధింపులకు గురిచేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అక్కమ్మ, గౌరమ్మ, శాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుపుతున్న ఆశా వర్కర్లు

రక్తహీనతను అధిగమించేందుకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

చిన్నపిల్లలతో పాటు బాలికల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కోర్టు హాలులో వివిధ సంక్షేమ పథకాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాల నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రణాళిక బద్ధంగా పనిచేయాలని పురోగతి చూపించకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. 5 ఏళ్ళ లోపు చిన్నపిల్లలు, 10 నుంచి 19 లోపు బాలికల్లో రక్తహీనత, పోషకాహార లోపం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం సంబంధించి డిఈఓ, అంగనవాడిలో పౌష్టికాహారం పంపిణీ పై సాంఘిక, గిరిజన సంక్షేమ వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు నెలవారీ సర్వేలు నిర్వహించాలన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ద్వారా గుర్తించిన, ఆమోదించిన పనులు వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. 133 పనులకు ఆమోదం తెలిపారని, ధర్మవరం అర్బన్, కదిరి అర్బన్, గోరంట్ల, మడకశిర, పుట్టపర్తి అర్బన్, హిందూపురం అర్బన్ మండలాల్లో పనుల్లో పురోగతి చూపించాలన్నారు. బుక్కపట్నం కదిరి వెస్ట్, ఒడిసి మండలాల్లో అంగనవాడి పనితీరు సుస్థిరత అభివృద్ధి లక్ష్యాల్లో వెనుకబడి ఉన్నాయని పురోగతిపై అధికారులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమ్మ ఒడి, చేయూత, కాపు నేస్తం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌లో అధికారులు సంసిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సిపిఓ విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, డిఎంహెచ్ఓ ఎస్‌వి కష్ణారెడ్డి, ఐసిడిఎస్ పిడి లక్ష్మి కుమారి, బిసి సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి, నోడల్ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.



పాలసముద్రం జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ అరుణ్ బాబు

పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం లాభదాయకం

గోరంట్ల రూరల్ : పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం రైతులకు ఎంతో లాభదాయకం ఉంటుందని కలెక్టర్ అరుణ్ బాబు పేర్కొన్నారు. నాసిన్ జాతీయ సంస్థ బెంగళూరు ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని పాలసముద్రం అనంత పాఠశాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ రైతులు లాభదాయకమైన పంటలను సాగు చేసి మంచి దిగుబడులు సాధించాలని, అలాంటి వాటిలో పుట్టగొడుగులు, తేనెటీగలు పెంపకం ఎంతో లాభదాయకమని తెలిపారు. వీటి ఉత్పత్తులకు మార్కెట్లో రోజురోజుకు డిమాండ్ పెరుగుతోందని దాని వలన రైతుకి ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం పుట్టగొడుగులు, తేనెటీగల, పెంపకం గురించి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశంలో నాసిన్ జాతీయ సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు పలువురు రైతులకు పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకంపై అవగాహన కలిగించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకం చేపట్టి సమాజానికి, పర్యావరణానికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సెక్రటరీ సంజయ్ మల్హోత్రా, నాసిన్ కంపెనీ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, తహశీల్దార్ రంగనాయకులు, సర్పంచి గంగులప్ప, పాలసముద్రం గోవిందరెడ్డి, వాలంటీర్ చంద్రమోహన్ రెడ్డి, పెనుగొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు, ప్రజలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం బోల్తా.. వ్యక్తి మృతి

ముదిగుబ్బ : ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటనలో ఒకరు మృతి చెందిన సంఘటన మంగళవారం ముదిగుబ్బ సమీపంలోని బిఎస్ఎన్ఎల్ టవర్ వద్ద చోటు చేసుకుంది. వివరాలు.. మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లికి చెందిన రమేష్(35) ద్విచక్ర వాహనంపై వెనుక వైపున ఓ సంచి పెట్టుకుని అనంతపురం వైపు బయల్దేరాడు. అయితే బిఎస్ఎన్ఎల్ టవర్ సమీపంలో రోడ్డు మరమ్మతుల్లో భాగంగా ఉంచిన సిమెంట్ దిమ్మె(రెడ్ లైట్ సూచిక)ను ఢీకొన్నాడు. దీంతో అదుపుతప్పి బోల్తా పడడంతో అక్కడికక్కడే మృతి చెందా డు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరకుని కన్నీరు మున్నీరుగా విలపించారు. అలాగే పోలీసులు, జడ్పిటిసి తిరుమల నాయక్ సహాయక చర్యలు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

నల్లచెరువు : మండల పరిధిలోని తిరుమలదేవరపల్లి గ్రామానికి చెందిన సానే గోవిందురెడ్డి(37) సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, గ్రామ స్తులు తెలిపారు. అతడు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అప్పులు ఎక్కువయ్యాయి. వాటిని తీర్చడానికి బెంగళూరు వెళ్లి అక్కడ ఏదో పని చేస్తుండేవాడు. ఇటీవల స్వగ్రామం వచ్చిన అతడు అప్పుల బాధ భరించలేక తీవ్ర మనస్థాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ వరలక్ష్మి సంఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం కదిరి ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి ఆకస్మిక మృతి.. కేసు నమోదు

బత్తలపల్లి : స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఓ యువకుడు సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, ఏఎస్ఐ కాశీం తెలిపిన వివరాలు.. ఎస్సీ కాలనీకి చెందిన అక్కెం ఓబిలేసు(34), లక్ష్మీదేవి భార్యాభర్తలు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. బత్తలపల్లి కూడలిలో పండ్ల వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవారు. అయితే సోమవారం రాత్రి ఉన్నఫలంగా ఆరోగ్యం బాగాలేదని ఆర్‌డిటి ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మంగళవారం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు.

బదిలీపై వెళ్లిన ఎఎస్ఐకి సన్మానం

గాండ్లపెంట : స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా పని చేసిన ఎన్.వెంకటరమణారెడ్డి బదిలీపై వెళ్తుండడంతో మంగళవారం సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ డిఎస్ శివశంకర్‌నాయక్, ఎస్ఐ బి.మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ సాధారణ బదిలీల్లో భాగంగా ఏఎస్ఐ ఓడిసికి బదిలీ అయ్యారన్నారు. ఆయన విధుల్లో గుర్తింపు తెచ్చుకొని ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో జమేదార్ తిరుమల రెడ్డి, బాలాజీనాయక్, నాగరాజు, భాస్కర్‌రాజు, శ్రీనివాసులు, నరసింహ, బాబు, బాషా, సిబ్బంది పాల్గొన్నారు



వెంకటరమణారెడ్డిని సన్మానిస్తున్న సిఐ, ఎస్ఐ

ప్రజలకు నాణ్యమైన వైద్యమందించాలి

డిప్యూటీ డిఎంహెచ్ఒ సెల్వియా సాల్మన్

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్లలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని డిప్యూటీ డిఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్ ఆదేశించారు. పట్టణంలోని ఎన్జీవో హోంలో మంగళవారం 6 అర్బన్ హెల్త్ సెంటర్లలోని మెడికల్ ఆఫీసర్లు, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలకు ఒక రోజు శిక్షణ, అవగాహన తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సెల్వియా సాల్మన్ మాట్లాడుతూ ఎంసిడిసిడి సర్వేను ప్రతి కేంద్రంలోనూ 85 శాతం పైగా ఉండాలని, గర్భిణీల నమోదు, శిశువులకు వేసే టీకాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. అదేవిధంగా కంటి వెలుగు కార్యక్రమాలు కూడా జూన్, జూలై నెలలో అన్ని అర్బన్ హెల్త్ సెంటర్లలో నిర్వహించబడునని, ప్రతి ఒక్కరికి కంటి వెలుగును ఇవ్వడమే మన ధ్యేయమని తెలిపారు. అదేవిధంగా ఉదత అతిశారా నియంత్రణ పత్రోత్సవాలు ఈనెల ఐదు నుండి 17వ తేదీ వరకు నిర్వహించాలని, విరోచనాల నివారణలో ఓఆర్ఎస్,జింకు వాడుటపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఓఆర్ఎస్ తోపాటు జింక్ వాడితే, మీ పిల్లల శక్తిని, బలాన్ని యధాస్థితికి తీసుకొస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఉరుకుందప్ప, మెడికల్ ఆఫీసర్లు శ్రావణి, సురేష్, గౌతమి, కొత్తపేట పిహెచ్‌సి డాక్టర్ జి.చంద్రిక, శివానగర్ పిహెచ్‌సి డాక్టర్ స్వాతి, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

ఎమ్మెల్యే తిప్పేస్వామి

ప్రజాశక్తి-రొళ్ల

పేదల కోసం అనుక్షణం శ్రమించే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన మంగళవారం మండల పరిధిలోని రత్నగిరి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేసేందుకు వాలంటీర్ వ్యవస్థ తెచ్చిన ఘనత జగన్‌దే అన్నారు. మీ ఊరికి వచ్చాను.. మీ ఇంటి ముంగిటికి వచ్చాను.. రోజూ మన నియోజకవర్గం చుట్టూనే తిరుగుతున్నాను. ఇంతకు ముందు టిడిపి ఎమ్మెల్యేలు ఎప్పుడైనా ఇలా వచ్చారా? అని ప్రశ్నించారు. రాష్ట్రమంతా వైసిపి ఎమ్మెల్యేలు జనం మధ్యలోనే ఉన్నారన్నారు. ఆయన వెంట సింగిల్‌విండో అధ్యక్షులు మోతిరామ్‌నాయక్, సర్పంచి చిన్న రంగప్ప, శ్రీనివాస్, సచివాలయ కన్వీనర్ నాగేంద్రప్ప. ఎంపీటీసీలు, సర్పంచిలు మండల కన్వీనర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి-చిలమత్తూరు

పెండింగ్‌లో ఉన్న 4 వారాల బిల్లులు చెల్లించాలి వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ఫిరంగి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఆయన మంగళవారం కొడికొండ పంచాయతీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. 4 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు కూలీలు తమ దృష్టికి తీసుకొ చ్చారన్నారు. కూలీ రేట్లు చాలా తక్కువగా పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. కొండ ప్రాంతంలో పని చేస్తున్నా కనీస రక్షణ చర్యలు లేవన్నారు. ఇలాంటి పరిస్థితులే జిల్లా వ్యాప్తంగా కనిపిస్తున్నాయ న్నారు. ప్రథమ చికిత్స బాక్సులు కూడా పని ప్రదేశాల్లో కనిపించడం లేదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్ఎంపి సిఐటియు కార్మిక సంఘం సౌజన్యంతో పని ప్రదేశాల్లో ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు సన్నద్ధం అవుతున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట సిఐటియు నాయకులు రామచంద్ర, వెంకటేష్ పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

రాష్ట్రంలో అరాచక పాలన : 'చిలకం'

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి విమర్శించారు. "సేవ్ ధర్మవరం" కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలోని పార్థసారధినగర్, లక్ష్మీచెన్నకేశవపురంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆరాచక పాలన సాగుతుంటే, ధర్మవరంలో నియంతపాలన సాగుతోందన్నారు. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలపై దాడులు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. వైసీపీ నాలుగేళ్ల పాలనలో ధర్మవరంలో చేనేతలు నానా అగచాట్లు పడుతున్నారన్నారు. చేనేతలపై నిజంగా ప్రేమ ఉంటే ముడిసరుకుల ధరలు తగ్గించి, గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మధుసూదన్ రెడ్డి

వేళకు తెరుచుకోని సచివాలయం.. బయటే వేచి ఉన్న సిబ్బంది

రొద్దం : రొద్దంలోని సచివాలయం-3 కార్యాలయం మంగళవారం ఉదయం 10:30 గంటలైనా తెరుచుకోలేదు. దీంత సమయానికి వచ్చిన సిబ్బంది బయటే వేచి ఉన్నారు. ఈ పరిస్థితిని చూసిన కొందరు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థను కొందరు సిబ్బంది నీరుగార్చేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. దీనిపై ప్రజాశక్తి విలేకరి వారిని వివరణ కోరగా తాళం చెవి అందుబాటులో లేకపోవడంతో బయటే నిల్చొని ఉన్నామని సమాధానం ఇచ్చారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమా లేక నిర్లక్ష్యమా అని పలువురు మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా ఈ సచివాలయంలో దాదాపు 11 మంది సిబ్బంది ఉండగా, కేవలం ఇద్దరు మాత్రమే ఉదయం 10.30 గంటలకు హాజరవడం గమనార్హం. సిబ్బంది డ్రెస్ కోడ్‌ను, సచివాలయం పరిధిలో ఉండాలన్న నిబంధలను సైతం తుంగలో తొక్కారన్న విమర్శలు ఉన్నాయి. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కార్యక్రమాలు నిర్వహించినప్పుడు మాత్రమే డ్రెస్ కోడ్ పాటిస్తున్నారు. ఇప్పటికైనా సచివాలయ సిబ్బందిని గాడిలో ఉంచి ప్రజలకు సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.



ఫొటో సచివాలయం బయట వేచి ఉన్న సిబ్బంది

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-బత్తలపల్లి

ప్రజల నుంచి సేకరించి కర్నాటకకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 30 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యాన్ని జిల్లా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, రెవెన్యూ అధికారులు మంగళవారం పట్టుకున్నారు. సిఎస్‌డిటి శారద తెలిపిన వివరాలు.. అందిన సమాచారం మేరకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సాయిప్రసాద్, ఈశ్వరయ్య, సిబ్బంది, బత్తలపల్లి సిఎస్‌డిటి శారద మండల పరిధిలోని సంగాల గ్రామం వెళ్లారు. అక్కడ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉన్న బొలెరో వాహనం నిలిపి ఉండగా తనిఖీ చేయడంతో 30 క్వింటాళ్ల ప్రజా పంపిణీ బియ్యం ఉండడంతో ఆ వాహనాన్ని సీజ్ చేశారు. ఈ బియ్యాన్ని సంగాల గ్రామానికి చెందిన నవీన్, లక్ష్మీనారాయణలు ప్రజల నుంచి సేకరించి కర్నాటకలోని బళ్లారి, పావగడకు తరలించేందుకు సిద్ధం చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. నిందితులపై క్రిమినల్ కేసు నమోదు చేయించినట్లు వారు తెలిపారు. దాడుల్లో విఆర్ఓ సాకే ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



సీజ్ చేసిన రేషన్ బియ్యంతో అధికారులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే శంకర్ నారాయణ

ప్రజాశక్తి -పెనుకొండ

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని పెనుకొండ ఎమ్మెల్యే శంకర్ నారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని శెట్టి పల్లి పంచాయతీ పరిధిలోని బొజ్జిరెడ్డి పల్లి గ్రామంలో స్థానిక నాయకులతో కలసి ఎమ్మెల్యే శంకర్ నారాయణ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ నారాయణ కు, స్థానిక నాయకులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల లబ్ధి ప్రజలకుఎమ్మెల్యే వివరించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యే దష్టికి సమస్యలను తీసుకురావడం జరిగింది. వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బోయ గిరిజమ్మ,ఇస్లాపురం సింగిల్ విండో అధ్యక్షులు కష్ణారెడ్డి, ఎంపీపీ గీతా రామ్మోహన్ రెడ్డి ,మండల కన్వీనర్ నాగలూరు బాబు, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలు , సర్పంచులు, వైఎస్ఆర్ సీపీ ముఖ్యనాయకులు, సచివాలయ కన్వీనర్, ఇతర అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

ప్రజాసంక్షేమమే ధ్యేయం : నూతన కమిషనర్ శేషన్న

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడం, ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయమని నూతన మున్సిపల్ కమిషనర్ శేషన్న పేర్కొన్నారు. ఆయన మంగళవారం మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. దీంతో ప్రస్తుత కమిషనర్ మల్లికార్జున బాధ్యతలను శేషన్నకు అప్పగించారు. అనంతరం మల్లికార్జునతో పాటు అసిస్టెం ట్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ ఆనంద్, అకౌంటెంట్ శ్రీనివాసులు, డిఈ వన్నూరప్ప, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు గోరకాటి పురుషోత్తం రెడ్డి, కాంట్రాక్టర్లు బడన్నపల్లి కేశవరెడ్డి, ఖాదర్ వలి, రామయ్య, రమేష్ నూతన కమిషనర్‌కి స్వాగతం పలికి బొకేలు, పూల మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బదిలీపై వెళుతున్న మల్లికార్జున కార్యాలయంలోని అధికారులను, సిబ్బందిని పరిచయం చేశారు. అలాగే వార్డుల్లో సమస్యలు, వాటి ప్రగతి, తదితర విషయాలను మల్లికార్జున ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతకుముందు కమిషనర్ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, కలెక్టర్ అరుణ్ బాబులను మర్యాదపూర్వకంగా కలిశారు.



మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న శేషన్న



వైద్య సిబ్బందితో అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయర్

జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

బత్తలపల్లి : జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వాటిని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయర్ వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఆశా డే సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పనితీరుపై సమీక్షించారు. జూన్ 5 నుంచి 17వ తేదీ వరకు జరిగే డయేరియా(అతిసారం) కార్యక్రమంలో నిర్వర్తించాల్సిన అంశాలను వివరించారు. డయేరియా బారిన పడే ఐదేళ్లలోపు బిడ్డల మరణాలను తగ్గించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఓఆర్ఎస్, జింక్ ప్రాధాన్యతతో పాటు పుట్టిన బిడ్డకు తల్లి పాల ప్రాధాన్యత, అదనపు ఆహారం గురించి వివరించారు. సమావేశంలో వైద్యాధికారి గంగిరెడ్డి, సీహెచ్ రాజశేఖర్, పర్యవేక్షకులు వేమారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, నారమ్మ, గౌరమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా ప్రజాసేవ

ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పార్టీలకు అతీతంగా ప్రజలకు సేవ చేయడానికి ఎప్పుడూ ముందుంటానని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో మంగళవారం సాతార్లపల్లి, గంగిరెడ్డిపల్లి, దిగువ చెర్లోపల్లి గ్రామాల్లోని దాదాపు 40 కుటుంబాలు టిడిపిని వీడి పుడా ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ గంగాద్రి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే సమక్షంలో వైసిపి కండువా వేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలు తీర్చడానికి పార్టీ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచి ఉంటాయన్నారు. జగన ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు ఆకర్షితులై వైసిపిలో చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, రూరల్ కన్వీనర్ నరసారెడ్డి, వైస్ ఎంపిపి రంగన్న, సర్పంచి బాలు, కుమారమ్మ, వార్డు మెంబర్లు రాఘవయ్య, నారాయణస్వామి, గోపి, అనితమ్మ, కళమ్మ, చిన్న ఉత్తప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్‌గా కరుణాకర్

బుక్కపట్నం: నూతన తహశీల్దార్‌గా కరుణాకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ నటరాజ్ కదిరికి బదిలీ అయ్యారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని తెలిపారు. అనంతరం కార్యాలయ సిబ్బంది బదిలీపై వెళ్తున్న నటరాజును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, వీఆర్వోలు లక్ష్మీనారాయణ రెడ్డి, సుధాకర్, చంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

మట్టిపరీక్షలు తప్పనిసరి

ప్రజాశక్తి - అనంతపురం

పంటల సాగు, అధిక దిగుబడి సాధించాలంటే పంటసాగు చేసే పొలం మట్టిపరీక్ష తప్పనిసరి అని వ్యవసాయ పరిశోధకులు ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని ఎస్కేయూనివర్సిటీ సమీపంలో ఉన్న ఆకుతోటపల్లికి చెందిన ప్రసాద్ పంటలను ఆశించే తెగుళ్లను తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడి అనే జీవ శిలీంద్రం తయారు చేస్తున్నాడు. హైదరాబాదుకు చెందిన బయోటెక్ కిసాన్ హబ్ మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్, ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ టెక్నాలజీతో పాటు కేంద్ర ప్రభుత్వ సంస్థల సహకారంతో ఆయన ఈ పనులన్నీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పంటల సాగు, అధిక దిగుబడులు, ఎరువుల వాడకంపై పలు విషయాలను వెల్లడించారు. సేంద్రియ కర్బనం కనీసం 0.75 నుంచి 1.5 శాతం వరకు ఉంటే ఆ నేల సారవంతంగా ఉన్నట్లు అని చెప్పారు. మనం తిన్న ఏ ఆహార పదార్థాలైనా జీర్ణం కావాలంటే మన జీర్ణ వ్యవస్థ బాగుండాలన్నారు. జీర్ణవ్యవస్థ బాగుంటే 90శాతం జబ్బులు దరి చేరవన్నారు. అలాగే మన నేలకు అందించే ఏ రకమైన రసాయన ఎరువులుకానీ, పురుగులమందులు కాని ఆ మొక్క తీసుకొని పంట దిగుబడికి, ఎదుగుదలకు సహకరించలన్నారు. అది జరగాలంటే సేంద్రియ కర్బనం అనేది వ్యవసాయం చేసే ప్రతి నేలలో ఖచ్చితంగా ఉండి తీరాలని చెప్పారు. ప్రధానంగా మనం వ్యవసాయం చేసే భూమిలో పోషకాలు ఏస్థాయిలో, ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే మట్టి పరీక్ష తప్పనిసరి అన్నారు. వీటి గురించి తెలుసుకున్నప్పుడే ఏ రసాయన మందు ఎంత వాడాలో తెలుస్తుందని చెప్పారు. తగినంత ఎరువులు, మందులు వాడినప్పుడే తెగుళ్ల నివారణ, పంట అధిక దిగుబడి సాధ్యమవుతుందని వివరించారు. అయితే సహజ వ్యవసాయం చేసే రైతులు మట్టి పరీక్ష చేయించుకోవాల్సిన అవసరమే లేదని అన్నారు. వ్యవసాయం చేసే ఏ భూమిలోనైనా మనిషి తినడానికి పనికొచ్చే ఏ ఆహారం అయినా, ధాన్యమైన, కూరగాయలైనా, పండ్లు అయినా పండుతాయన్నారు. అయితే ఏ రైతు అయినా పంటసాగు చేసే విధానం, ఎరువుల వాడకం, నేల స్థితిని బట్టి పంట దిగుబడి ఉంటుందని చెప్పారు. మొక్క పెరుగుదలకు, పండ్లు, ఫలాలు ఇవ్వడానికి వాటి జీవన ప్రక్రియకు తోడ్పడటానికి కొన్ని వందల కోట్ల సూక్ష్మజీవులు, బ్యాక్టీరియా, శిలీంద్రాలతో కూడుకొని ఉన్న ఈ భూమి ప్రతి రైతుకు ఒక అద్భుతమైన వనరు అని అభిప్రాయపడ్డారు. ప్రధానంగా భూమి లోపల నుంచి వచ్చే వేరు వ్యవస్థపై మొక్క 90 శాతం ఆధారపడి జీవిస్తుందన్నారు. వేరు వ్యవస్థ కాకుండా మిగిలిన భాగమంతా కేవలం 10 శాతం ప్రభావం ఉంటుందన్నారు. ఏ మొక్క అయినా భూమి నుంచి వ్యాపించే తెగుళ్లు, వైరస్ ద్వారా చనిపోతుందే తప్ప పైన ఆకులను తినే పురుగు, రసం పీల్చే పురుగు, కాయ తొలుచు పురుగు వల్ల చనిపోదన్నారు. మహా అయితే కొంత ప్రభావం ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇక శ్వాసక్రియల విషయానికి వస్తే మొక్కలు రెండు రకాల శ్వాసకూరాలు తీసుకుంటాయన్నారు. భూమి లోపల వేరు వ్యవస్థ ఆక్సిజన్ ను తీసుకొని కార్బన్‌డయాక్సైడ్‌ను వదులుతుందన్నారు. అదే విధంగా భూమిపైన ఉండే కొమ్మలు, ఆకులు కార్బన్‌డయాక్సైడ్‌ను తీసుకొని ఆక్సిజన్ ను వదులుతాయన్నారు. ప్రధానంగా వ్యవసాయం చేస్తున్న భూమిలో అత్యంత విలువైన సారవంతమైన మట్టి పైనున్న 6 అంగుళాల పొరమాత్రమే అని దీన్ని జాగ్రత్తగా కాపాడుకోలేకపోతున్నామని అన్నారు. పెద్ద పెద్ద వర్షం చినుకులు నేరుగా భూమి మీద పడినప్పుడు, మనం ఎక్కువగా నీటిని పారించినప్పుడు, బలమైన ట్రాక్టర్ తో సేద్యం చేసినప్పుడు పెద్ద వర్షాల వల్ల నేలపై కొట్టుకుపోవడం వల్ల, సున్నితమైన, సారవంతమైన, మట్టి రేణువులు, కొట్టుకుపోయినప్పుడు నేల సారవంతమైన మట్టిని కోల్పోతుందన్నారు. 30 డిగ్రీల ఎండ దాటితే ఏ సూక్ష్మజీవి కూడా భూమి మీద బతకదని శాస్త్రీయపరంగా నిరూపితమైందని చెప్పారు. మొక్కకు కావలసిన అన్ని రకాల పోషకాలు కన్నా అతి ప్రధానమైన ప్రాణాధారమైన పోషకం సేంద్రీయ కర్బనం అని వివరించారు. దీన్ని పెంచుకోవాలంటే పశువుల ఎరువు, లేదా జీవాల ఎరువు, లేదా కంపోస్టులలో జీవన ఎరువులు అని అన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఎదుర్కొంటున్న సమస్య భూతాపం అని అన్నారు. అటవీ విస్తీర్ణం తగ్గిపోవడం కొత్తగా వృక్ష సంపద లేకపోవటం వాటిని తొలగించడంతో పాటు ఎక్కువగా రైతులు వాడుతున్న రసాయనాల కారణంగా భూతాపం పెరుగుతుందని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న 15 రకాల రసాయనాలు వాడని సేంద్రీయ వ్యవసాయ విధానాలు ఉన్నాయని వీటిలో ఏ ఒక్కటైనా ప్రారంభించి వ్యవసాయం చేస్తే ఖచ్చితంగా ఆ నేల అత్యంత సారవంతంగా తయారవుతుందని అన్నారు.


వ్యవసాయ పరిశోధకులు ప్రసాద్

బాధ్యతలు స్వీకరించిన అధికారులు

బత్తలపల్లి : మండలానికి ఇతర ప్రాంతాల నుంచి బదిలీపై వచ్చిన కొత్త అధికారులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ప్రభాకర్ అనంతపురం జిల్లా పరిషత్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడి నుంచి లక్ష్మీకళ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అలాగే మాల్యవంతం పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు చిలమత్తూరు మండలానికి బదిలీ కాగా చిలమత్తూరు మండలం నుంచి వచ్చిన గంగరత్నమ్మ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారు ఉన్నతాధికారులను కలిశారు.

డయేరియాపై అవగాహన

ముదిగుబ్బ: మొలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తప్పెటవారిపల్లి గ్రామంలో మంగళవారం వైద్యాధికారి డాక్టర్ బి.నాగేంద్రనాయక్ ఫామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. అలాగే ఉధృత నీళ్ల విరేచనాల నివారణ కార్యక్రమంలో భాగంగా పోస్టర్లను విడుదల చేసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో ఓఆర్ఎస్, జింక్ కార్నర్‌ను ప్రారంభించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను తల్లులకు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నీళ్ల విరేచనాలు, న్యుమోనియా వల్ల ఐదేళ్ల లోపు పిల్లల మరణాలు 50 శాతం జరుగుతున్నాయని తెలిపారు. నీళ్ల విరేచనాల వల్ల దుష్పరిణామాలు, వాటిని గుర్తించి నివారణోపాయాలను వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ఒ శైలజ, ఆరోగ్య కార్యకర్తలు హరనాథ్‌రెడ్డి, రాజేశ్వరి, ఎస్.లక్ష్మీదేవి, ఆశా కార్యకర్త గంగాదేవి, 104 సిబ్బంది విష్ణు, డిఈఓ, పైలెట్ ప్రవీణ్, పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిడిపి నాయకులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం పట్టణంలోని 25వ వార్డులోని శాంతినగర్, శివానగర్ ప్రాంతాలకు చెందిన సెక్షన్ ఇన్‌ఛార్జిలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపి ఘన విజయం సాధిస్తుందన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందన్నారు. ప్రతి ఇంటి వద్దకూ వెళ్లి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే అందించే సంక్షేమ పథకాల గురించి వివరించాలన్నారు. నియోజకవర్గంలో టిడిపి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు కాచర్ల కంచన్న, చింతపులుసు పెద్దన్న, రాళ్లపల్లి షరీఫ్, దేవరకొండ రామకృష్ణ, రవి, మారుతీస్వామి, పల్లపు శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం కోసం కలెక్టర్‌కు వినతి

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని పాలసముద్రం గ్రామస్తులు శ్మశాన వాటిక స్థలాన్ని చూపించాలని కలెక్టర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఆయన నాసిన్ జాతీయ సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా సర్పంచి గంగులప్ప, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు, పలువురు ప్రజలు విన్నవించారు. గ్రామంలో శ్మశానవాటిక చెరువుకు సంబంధించిన పొలంలో ఉన్నందువల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని తక్షణమే శ్మశానవాటిక, పాఠశాల ఆట స్థలముకు స్థలం కేటాయించాలని కోరారు. అనంతరం వారు కలెక్టర్ అరుణ్ బాబుని సన్మానించారు. కార్యక్రమంలో పాలసముద్రం నరసింహులు, గోవిందరెడ్డి, వాలంటరీ చంద్రశేఖర్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పోతుల సురేష్‌కు సన్మానం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

రోడ్డు మార్గాన ముదిగుబ్బ మీదుగా కదిరికి వెళ్తున్న పోతుల సురేష్‌ను మంగళవారం డిష్ వెంకటేష్, కృష్ణం మహేష్ నివాసానికి ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్యుల సంఘం సభ్యులు సూర్యనారాయణ, యువజన సంఘం సభ్యులు కృష్ణం మహేష్ కుమార్ మాట్లాడుతూ పోతుల సునీత రెండో దఫా ఎమ్మెల్సీగా ఎన్నిక కావడతో ఆర్యవైశ్య సంఘం తరపున సన్మానించామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఆర్యవైశ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై దాడులు దుర్మార్గం : టిడిపి

పెనుకొండ : ప్రజల్లో టిడిపికి లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక అధికార పార్టీ నాయకులు దాడుల కు పాల్పడడం దుర్మార్గమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సీఎం జగన్‌రెడ్డికి దళిత ఎమ్మెల్యేలు అంటే గౌరవం లేదన్నారు. ఎమ్మెల్యే డోలా వీరాంజనేయ స్వామి అరెస్టు జగన్ ప్రభుత్వం సైకో ఇజానికి నిదర్శనం అన్నారు. అలాగే ప్రకాశం జిల్లాలో అంగన్వాడీ కార్యకర్త, ఆమె భర్త టిడిపి సానుభూతిపరులు అనే ఉద్దేశంతో హనుమాయమ్మను ట్రాక్టర్‌తో తొక్కించి చంపేశారన్నారు. వచ్చే ఎన్నికల్లో దళితలే వైసిపికి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో శ్రీరాములు, సూర్యనారాయణ, త్రివేంద్రనాయుడు, చిన్న పోతన్న, పోతన్న, సుబ్రహ్మణ్యం, వాసుదేవరెడ్డి, బుషప్ప, ఆదినారాయణ, సోము, ముత్యాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : టిడిపి ఎమ్మెల్యే వీరాంజనేయస్వామిపై వైసిపి నాయకుల దాడి హేయమైన చర్య అని టిడిపి ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళిత ఎమ్మెల్యేపైనే దాడి చేసి ఆయనపైనే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. సీఎం జగన్ దళితులపై దాడులు చేయించడం దారుణమన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కు దళితులే ఓటు ద్వారా బుద్ధి చెబుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ నాయకులు బుక్కపట్నం శ్రీనివాసులు, గజ్జల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

పెనుకొండ : రాష్ట్రంలో ఉన్నది ప్రజాస్వామ్య రాజ్యమా, ఫ్యాక్షన్ రాజ్యమా అని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారధి మంగళవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. ఎమ్మెల్యే పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు రాజ్యాంగ విరుద్ధంగా ఉందన్నారు. ఆయనకు వైసిపి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రశాంత వాతావరణానికి మారుపేరైన కొండపి నియోజకవర్గంలో ఫ్యాక్షన్ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆ పోలీసు అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ సాక్షిగా దళిత ఎమ్మెల్యేపై వైసిపి దాడి చేసిందని, నియోజవర్గంలో ఇప్పటికే రెండుసార్లు ఆయనపై దాడికి పాల్పడ్డార న్నారు. ప్రజలు చూస్తూ ఊరుకోరని తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

స్థలాలు ఇప్పించండి

పుట్టపర్తి రూరల్ : తమకు కేటాయించిన నివాస స్థలాలను ఇతరులు ఆక్రమించారని వాటిని తిరిగి తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. గతంలో నక్సలైట్ ఉద్యమంలో, సానుభూతి పరులుగా పని చేసి ప్రభుత్వం ఎదుట స్వచ్ఛందంగా లొంగిపోయామన్నారు. 2014లో ధరణి వెల్ఫేర్ అసోసియేషన్ ఏర్పాటు చేసుకుని దాని ద్వారా కప్పలబండ పొలంలో సర్వే నంబర్-315లో 4.88 ఎకరాల భూమి విక్రయించి అభివృద్ధి చేసుకుని ప్లాట్లు వేసుకుని ఇళ్లు నిర్మి చుకున్నామన్నారు. అయితే లోచర్ల విజయభాస్కర్ రెడ్డి దౌర్జన్యంగా మా ఇళ్లను కూలగొట్టి ధరణికి సంబంధం లేని వారిని కాలనీలో చేర్చుకున్నారని వాపోయారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో కోర్టును ఆశ్రయించగా న్యాయస్థానం తమకు అనుకూలంగా ఆర్డర్ చేసిందన్నారు. కావున ఆ స్థలంలో ఇతరులు ప్రవేశించకుండా సొంతదారులకు పట్టాలు ఇవ్వాలని వారు కలెక్టర్, పోలీసులను పత్రికా ముఖంగా కోరారు.

ఆర్యవైశ్య సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి-కదిరి అర్బన్

ఆర్యవైశ్య సంఘాలను బలోపేతం చేసి ఆర్థికంగా మెరుగుపడేందుకు ఒకరికొకరు సహకరించుకోవాలని సామాజిక నాయకులు, ఉద్యమకారుడు పోతుల సురేష్ సూచించారు. స్థానిక ఆర్యవైశ్య మందిరంలో మంగళవారం కదిరి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడా వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన 'ఆత్మీయులకు సత్కారం' కార్యక్రమానికి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐకమత్యమే మహాబలం, మహా బలమే విజయానికి సోపానం, ఇది గమనిస్తే ఎవరైనా అందలం ఎక్కవచ్చన్నారు. అనంతరం కదిరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పోతుల సురేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సేవా భారతి అధ్యక్షులు మట్ట చెన్నరాయశెట్టి, అశ్వత్‌శెట్టి, వేణుగోపాల్, చలపతి శెట్టి, జనార్దన, సత్యనారాయణశర్మ, కదిరి ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, పలు జిల్లాల ఆర్యవైశ్య సంఘం నాయకులు, అధ్యక్షులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.